



# భూమి గుండ్రంగా ఉంటుంది

గన్నవరపు నరసింహమూర్తి

**ప్రత్యూషపు వేళ ! ఆ రోజు రమణమూర్తి వేకువనే లేచి డాబామీద ప్రకృతిని ఆస్వాదిస్తున్నాడు. అప్పుడే ప్రాక్ దిశ సింధూర వర్ణాన్ని సంతరించుకుంటోంది. అతను జీవితంలో ఈ రోజంతటి ప్రశాంతత ఎప్పుడూ పొందలేదు. ఎందుకంటే అంతకు క్రితంరోజే ప్రభుత్వ ఉద్యోగం నుంచి పదవీ విరమణ చేశాడు. సుమారు నలభై సంవత్సరాలపాటు తాలూకాఫీసులో క్లర్క్ స్థాయి నుంచి సూపరింటెండెంట్ దాకా వివిధ హోదాల్లో అలుపు లేకుండా పనిచేశాడు.**

అతను పదవీ విరమణ చేసిన రోజున అతను చేసిన సేవలకు గుర్తింపుగా ఆఫీసువాళ్ళు ఘనంగా సత్కరించారు. అందువల్ల ఆరోజురాత్రి ఇంటికి వచ్చేసరికి అర్ధరాత్రి దాటింది అయినా సరే ఈ రోజు అతను తెల్లారక మునుపే లేచాడు. దానికి కారణం అతనికేవిధమైన బాదరబందీ లేకపోవడం. ఒకవిధమైన ప్రశాంతత అతన్ని ఆవహించింది.

అతను ఉద్యోగంలో చేరిన దగ్గర్నుంచి విశ్రాంతిఎరగడు. చదువు పూర్తవగానే ఉద్యోగం, పూర్తయిన వెంటనే మేనమామ కూతురు విమలతో వివాహం, తదనంతరం ముగ్గురు పిల్లలు కలగడం, వాళ్ళ చదువులు, పెళ్ళిళ్లు.... యిలా... విసిగిపోయాడు.

ముఖ్యంగా పిల్లల చదువులతో, వాళ్ళ స్కూళ్ళతో అతను ఎన్నో ఇబ్బందులు పడ్డాడు వేల రూపాయలు పోసి స్కూళ్ళకు డొనేషన్లు కట్టడమే కాకుండా తిరిగి వాళ్ళు స్కూళ్ళకు వెళ్ళడానికి ఆటోలు, అవి సమయానికి రాకపోవడం, వాళ్ళతో గొడవలు తీరా పిల్లలు స్కూళ్ళకు వెళ్ళిన తరువాత తిరిగి ఇంటికి వచ్చేవరకు వడే టెన్షన్స్..యిలా ఎన్నో బాధలు అతనూ, భార్యా పడ్డారు.

పిల్లలు ముగ్గురుకి రెండేసేళ్ళు తేడా వల్ల ప్రాథమిక విద్య ఏడేళ్ళు సాగింది..అందరి చదువులు పూర్తయ్యేసరికి ఇరవై ఏళ్ళు పట్టింది. వాళ్ళ చదువుల కోసం ఉద్యోగంలో ఎన్నో ప్రమోషన్ అవకాశాలు వదులుకున్నాడు. ప్రమోషన్ కోసం ఆశపడితే బదిలీలు తప్పవు. ఆ ఊరు వదిలితే మంచి స్కూళ్ళు దొరకవు. అలా ప్రతీసారీ పదోన్నతులను నిరాకరించడం వల్ల చివరకు గుమాస్తాగానే పదవీ విరమణ చేయవలసి వచ్చింది. అయినా అతను ఏనాడు విచారించలేదు. పిల్లల చదువులు, ఉద్యోగంలో సాదక బాదకాలవల్ల జీవితంలో ప్రశాంతతని కోల్పోయాడు. అది అతనికి అందని ఎండమావే అయ్యింది. అందుకే కనీసం పదవీ విరమణ తరువాతయినా పూర్తిగా విశ్రాంతి తీసుకోవాలని అతని ఆలోచన. అది ఈరోజు పదవీ విరమణ ద్వారా వచ్చినందుకు ఆ సుప్రభాత సమయాన్ని అతను ఆనందంగా ఆస్వాదిస్తున్నాడు.

ఎన్నడూ లేనిది ఆ రోజు ప్రభాత సమయం ఒక వింత అనుభూతి నిస్తోంది. ప్రకృతి ఆ సమయంలో చాలా శోభాయమానంగా కనిపించసాగింది. ఒకవైపు తూర్పు అరుణ వర్ణంతో భూపాలరాగం ఆలపిస్తుంటే, దూరంగా గుడిలోని గంటలసవ్వడి ప్రణవనాదంలా వీనులకు సోకుతూ జుగల్ బందీని తలపిస్తుంటే అతడు ప్రపంచాన్నే మైమరచిపోయాడు.

ఇంతలో భార్య విమల టీ కప్పు, పేపరుతో డాబా మీదకు వచ్చింది. అతను ప్రకృతిని ఆస్వాదిస్తూ ఆమెని గమనించకపోవడంతో "మిమ్మల్నే ! ఏమిటి అలా మైమరచిపోయి చూస్తున్నారు. టీ తీస్కోండి" అన్న ఆమె మాటలకు ఈ లోకంలో కొచ్చాడు. ఆమెకు ఆ రోజు అతని ప్రవర్తన ఎంతో వింతగా తోచింది. అతను అంత తెల్లవారి లేవడం ఆమెకు కొత్తగా, వింతగా తోచింది. "అవును విమలా! ఇన్నాళ్ళూ జీవితంలో చాలా అనుభూతుల్ని కోల్పోయాను. ప్రశాంతత కరువైంది. ఇప్పుడు ఎందుకో నా మనస్సు ఏకాంతాన్ని కోరుకుంటోంది" అన్నాడు రమణ మూర్తి. "సర్లేండి! ఇక రిటైరయ్యారుగా అంతా ప్రశాంతతే ఇంక మిమ్మల్ని ఎవ్వరూ ఇబ్బంది పెట్టరులేండి. అన్నట్టు మరచి పోయాను నిన్న ముగ్గురు పిల్లలూ ఫోన్ చేశారు. పెద్దవాడు, చిన్నవాడు వాళ్ళిళ్లకు రమ్మన్నారు. ఇక మీ ముద్దుల కూతురు శ్యామలైతే మిమ్మల్ని హాయిగా విశ్రాంతి తీసుకోమంది. వాటి విషయం ఆలోచించండి".

"లేదు విమలా! ఇప్పట్లో నేను ఎవరింటికీ వెళ్ళే ప్రసక్తే లేదు. వాళ్ళెవరి ఇళ్లలోనూ నాకు ప్రశాంతత దొరకదు. అక్కడ వాళ్ళ పిల్లల గోల టీవీల మోతలతో నా పరిస్థితి మొదటికొస్తుంది. అందుకే ఇప్పుడటువంటి కార్యక్రమాలేవీ పెట్టకు" అన్నాడు రమణమూర్తి ఆందోళనగా. "సర్లెండి, అలాగే గానీ, అన్నట్టు మరచిపోయాను పేపరు క్రింద విశ్వనాథం అన్నయ్యగారు వ్రాసిన ఉత్తరం ఉంది చూడండి" అంటూ క్రిందకు వెళ్ళిపోయింది.

విశ్వనాథం మాటవినగానే అతనికి ఎక్కడ లేని ఆనందం కలిగింది. విశ్వనాథం అతనికి ప్రాణస్నేహితుడు ఇద్దరిదీ ఒకే ఊరు కాకపోతే అతను

మున్సిపాలిటీలో పనిచేస్తుండడం వల్ల ఎన్నో ఊళ్ళు మారుతుంటాడు. ఎక్కడ పనిచేస్తున్నా వాళ్ళ రెండు కుటుంబాలు కలిసి తిరుపతి ప్రతీ సంవత్సరం వెళ్ళ వలసిందే! ఇక ఇంట్లో ఏ శుభకార్యం జరిగినా అతను కుటుంబంతో సహా పది రోజుల ముందే వచ్చేవాడు అంతటి అనుబంధం వాళ్ళిద్దరిదీ, అందుకే అతను వ్రాసిన ఉత్తరం ఆత్రంగా చదవసాగాడు రమణమూర్తి.

ప్రియమైన మూర్తికి,

విశ్వం వ్రాయునది నువ్వు మరో రెండు రోజుల్లో పదవీ విరమణ చేస్తున్నందుకు ఒక ప్రక్క ఆనందంగా ఉన్నా ఇంకో ప్రక్క బాధకూడా కలుగుతోంది. మనిద్దరివీ వేరే శాఖలైనా నువ్వు పదవీ విరమణ చేస్తుంటే ఒంటరి వాడినై పోతున్నానన్న బాధకలుగుతోంది.

వెనక్కి తిరిగి చూసుకుంటే ఇన్ని సంవత్సరాలు ఎలా గడచిపోయాయో అని ఆశ్చర్యం కలుగుతోంది. ఇంకా మొన్ననే మనం ఉద్యోగాల్లో చేరినట్టుగా కనిపిస్తోంది. కానీ నువ్వు అప్పుడే పదవీ విరమణ దాకా వచ్చేశావు. కాలచక్రానికి ఎంతటి వడి; తెలియకుండానే అది తన పని తాను చేసుకుపోతుంటుంది.

మనం విద్యార్థి స్థాయినుండి ఉద్యోగిగా మారి, తండ్రిగా పదోన్నతి పొంది తాతలుగా పరిణామం చెందటం కాలచక్ర మహిమకాక మరేమిటి చెప్పు! నిజంగా ఎంత గొప్పవో కదా ఈ సంసార బంధాలు!; కష్టాలలో కూడా తీయదనాన్ని చూపే అపురూపమైనవి ఈ రక్త సంబంధాలు!

నీ కన్నా రెండేళ్ళు ఆలస్యంగా ఉద్యోగంలో చేరిన నాకు ఇంకా ఈ బంధాలనుంచి విముక్తి కలగలేదు. ఇంకా చదువులు, పెళ్ళిళ్ళు మిగిలి ఉన్నాయి. ఈ విషయంలో నిన్ను చూస్తే నాకు ఒకింత అసూయ కలుగుతుంది. హాయిగా పదవీ విరమణకి ముందే అన్ని బాధ్యతలు నెరవేర్చేసుకున్నావు. ఇక శేష జీవితాన్ని మనమల మధ్య హాయిగా గడిపెయ్యవచ్చు

చివరగా నీ పదవీ విరమణ తదనంతరం శేష జీవితాన్ని ఆరోగ్యంగా, ఆనందంగా గడపాలనీ, అందుకు ఆ భగవంతుడు నీకు, మా చెల్లాయికి ఆయురారోగ్యాలు ఇవ్వాలని మనఃస్ఫూర్తిగా కోరుకుంటూ

నీ స్నేహితుడు 'విశ్వం'

ఆ ఉత్తరాన్ని చదివిన రమణమూర్తికి కళ్ళు చెమ్మగిల్లాయి. అవును; విశ్వం వ్రాసినవన్నీ అక్షర సత్యాలు. కాలం తిరిగిరాదు. ఆనందకర మయిన రోజులన్నీ వెళ్ళిపోయాయి. వాటిలో బాధలున్నా మధురమైనవి. సూర్యుడి తీక్షణమైన కిరణాలు ముఖం మీద పడేదాకా డాబామీదే గడిపాడు రమణమూర్తి.

× × ×

ప్రియమైన విశ్వానికి,

నీ అనుంగు మిత్రుడు మూర్తి వ్రాయునది నీవు వ్రాసిన మణి పూసలాంటి ఉత్తరం నిన్ననే అందింది. అది మన గత జీవితాన్ని గుర్తు చేసి మనం ఏం కోల్పోయామొ తెలియచెప్పింది. నిన్నటి దాకా నా జీవితం అవిశ్రాంతంగా ఎన్నో బాధ్యతలతో గడిచిపోయింది.

నువ్వు వ్రాసినట్లు పెళ్లైన నాటినుంచి పిల్లల చదువులు, పెళ్ళిళ్ల వాటితో విశ్రాంతి ఎండమావే అయ్యింది. కానీ ఇక నుంచి నా జీవితం బహుశా ప్రశాంతంగా గడుస్తుందనీ ఆశిస్తున్నాను. ఇక ప్రతి క్షణంనాదే; దాంట్లో ఒక్క మీ చెల్లెలు విమలకు తప్ప ఎవ్వరికీ చోటులేదు. నిజానికి ఇవన్నీ మా రోజులు.

విశ్వం! నిజంగా మనలాంటి మధ్యతరగతి మానవుల జీవితం తీపి, చేదు, పులుపుల కలయిక "చిన్ని చిన్ని ఆశ, పిడికెడంతనిరాశ; కాసింత ఆనందం; పిడికెడంత దుఃఖం, టన్ను బరువులు, వీశెడుబాధ్యతలు...ఇదేగా మధ్యతరగతి జీవితం అయినా ఇందులోనే ఉంది మాధుర్యం! ఈ బంధాల గుప్పెట్లో నలిగిపోయి వ్యక్తిగత జీవితాన్ని కోల్పోతాం మనం. దానికి చరమగీతం పాడటానికి వచ్చిన అవకాశమే ఈ పదవీ విరమణని నా ఉద్దేశం!



మద్రాస్‌లో ప్రముఖ తెలుగు సాంస్కృతిక సంస్థ 'జనని' పేద తెలుగు విద్యార్థులకు నగదు బహుమతి అందజేసే సభలో విద్యార్థిని సుకన్యకు బహుమతిని అందజేస్తున్న సుబ్రహ్మణ్యరాజు. ఇంకా చిత్రంలో శ్రీ గుడిమెట్ల చెన్నయ్య, డా॥ ఎస్. బషీర్ ఉన్నారు.

ఈ రోజు నుంచీ గువ్వలానేను స్వేచ్ఛా జీవిని. బంధాలు, బాధ్యతలు లేని భవభూతిని. ఈ రోజు నుంచీ అన్ని ప్రత్యూషపు ఉదయాలు నావే; ప్రభాతంలో భూపాలరాగాన్ని ఆస్వాదిస్తూ గుడిగంటల సవ్వడిని అనుభవిస్తూ దిన చర్యని ప్రారంభిస్తాను. దేవుని సన్నిధిలో ప్రశాంతతని పొందుతాను. మధ్యాహ్న సమయంలోతనివితీరా నిద్రపోతాను. అవును; ఇవన్నీ ఇప్పటిదాకా నాకు తీరని కోరికలు.

ఇక చివరగా నా పదవీ విరమణ రోజున నన్ను జ్ఞాపకం పెట్టుకొని ఉత్తరం వ్రాసినందుకు కృతజ్ఞతలు. చెల్లెల్ని పిల్లల్ని అడిగినట్లు చెప్పు. ఉంటాను.

నీ మూర్తి,

మధ్యాహ్నం భోజనం చేసిన తరువాత మంచం మీద కూర్చొని ఓపిగ్గా మిత్రుడు విశ్వనాథానికి జవాబు వ్రాశాడు రమణమూర్తి, ఇప్పుడతనికి ఆనందంగా వుంది. గాల్లో తేలిపోతున్న భావన కలుగుతోంది. సాయంత్రం దాన్ని పోస్టు చేయాలనుకొని తలగడ క్రింద పెట్టి నిద్రపోయేందుకు ఆయత్తమవుతుండగా 'పోస్ట్' అంటూ పోస్టమేన్ ఒకాయిన యిన్‌లాండ్ కవరిచ్చి వెళ్ళిపోయాడు.

రమణమూర్తి ఆత్రంగా వెళ్లి ఇది ఎక్కడి నుంచి వచ్చిందో చూశాడు. అది అతని కూతురు శ్యామల వ్రాసిన ఉత్తరం చదవడం ప్రారంభించాడు.

ప్రియమైన నాన్నగారికి,

శ్యామల నమస్కరించి వ్రాయునది ఉభయకుశలోపరి. మీరు ఈ నెలాఖరుకి పదవీ విరమణ చేస్తున్నందుకు నాకు చాలా సంతోషంగా వుంది. ఇప్పటికైనా ఆ ఆఫీసుపనులనుంచి మీకు విముక్తి కలుగుతున్నందుకు చెప్పలేని ఆనందం కలుగుతుంది.

ఇక అసలు విషయానికొస్తే మీ అల్లుడిగారికి హైదరాబాద్ నుంచి క్రొత్త ప్రాజెక్ట్ విషయమై ఆస్ట్రేలియా వెళ్లవలసి వస్తోంది. అక్కడ రెండు సంవత్సరాలు డిప్యుటేషన్ మీద పని చెయ్యవలసి ఉంటుంది. ఆ తరువాత మళ్ళీ ఇక్కడికే వచ్చేస్తారు. మీకు తెలుసు కదా ఆయన అలవాట్లు; రెండు సంవత్సరాలు నేను లేకుండా ఆయన ఉండలేరు. అక్కడ భోజన సదుపాయాలు ఆయనకు పడవు. అందుకే నన్ను కూడా తీసుకెళ్తామంటున్నారు. వీసాలు కూడా వచ్చేశాయి.

కానీ పిల్లల చదువు విషయమై మేము ఆందోళన చెందుతున్నాము. ఈ రెండు సంవత్సరాల కోసం వాళ్లని అక్కడికి తీసుకెళ్ళడం మంచిది కాదని మా ఆలోచన. అదీ గాక అక్కడి చదువు చాలా ఖరీదు. అందుకని నేను, మీ అల్లుడూ ఒక నిర్ణయానికొచ్చాము. వాళ్ళిద్దర్నీ చదువుకోసం మన ఊరు, మీ దగ్గరికి పంపించెయ్యాలని నిర్ణయించుకున్నాము. మనింటిదగ్గరా అందులోనూ మీ దగ్గర వాళ్ళ చదువులు బాగా సాగుతాయి. మనింటి దగ్గరైతే వాళ్ళకి ఏ అసౌకర్యం ఉండదు. అదీగాక పిల్లలు మీ దగ్గర ఉంటే మేము అక్కడ ప్రశాంతంగా ఉండగలుగుతాము. ఈ విషయం మీకు చెప్పమని మీ అల్లుడుగారు మీకు ఉత్తరం వ్రాయమని చెప్పారు.

అందుకే పిల్లలిద్దరినీ తీసుకొని నేను, మీ అల్లుడుగారు వచ్చే ఆదివారం వస్తున్నాము.




ఈ లోగా మేము చదివిన స్కూల్లో వాళ్ళకి సీట్లు రిజర్వ్ చేసి ఉంచండి. మీరు పదవీ విరమణ చేశారు కాబట్టి మనవలతో మీకు మంచి కాలక్షేపమే గాకుండా వాళ్ళకు తెలియని ఎన్నో విషయాలు చెప్పొచ్చు. అమ్మకి నా నమస్కారములు; మిగతా విషయాలు అన్నీ వేము వచ్చినప్పుడు మాట్లాడుకుందాం. ఉంటాను.

- శ్యామల

ఆ ఉత్తరాన్ని చదివిన రమణమూర్తికి కళ్ళు బైర్లు కమ్మాయి. ప్రపంచం తలక్రిందులౌతున్నట్లు భావన కలగసాగింది. పదవీ విరమణ చేసిన తరువాత జీవితాన్ని ప్రశాంతంగా గడపాలనీ తను ఆశించాడు. కాని విధి విపరీతం! తను ఒకటి తలిస్తే భగవంతుడు ఇంకోలా తలిచాడు. తన భావి జీవితం ప్రశాంతంగా సాగబోతోందని ఎంతో గర్వంతో మిత్రుడు విశ్వానికి ఉత్తరం కూడా వ్రాశాడు. ఇంకా నయం దాన్ని పోస్ట్ చెయ్యలేదు.

మళ్ళీ తన జీవితం మొదటికొచ్చింది. మళ్ళీ మనవలు, వాళ్ళ స్కూళ్ళు, క్యారేజీలు, ఆటోలు.. అతను తల పట్టుకున్నాడు. మళ్ళీ సమస్య మొదటికొచ్చింది. అవును భూమి గుండ్రంగానే ఉంటుంది. దానికి ప్రత్యక్ష ఉదాహరణ తనే వెంటనే తను విశ్వనాథానికి వ్రాసిన ఉత్తరం గుర్తుకొచ్చి దాన్ని తలగడ క్రిందనుంచి తీసి ముక్కలు ముక్కలుగా చించి అవతల పారేశాడు.

# పేరు మాత్రమే 'సజీవ' !

## విహారి

నిద్రపట్టదు-
అడుగునుంచీ
నెఱ్ఱెలు విచ్చిన నేల
ఆవిర్లు తేలుతూ ఉంటుంది,
అంపశయ్యమీద భీష్ముడేంగొప్ప
ముళ్ల చాపమీది మురికి బతుకుచిప్ప!
రెప్పలమధ్య దృశ్యాలూ, నాలుకమీద కలవరింతలూ...
నెత్తిమీద
కడవలతో ఇక్కట్ల కన్నీళ్ళు కుమ్మరిస్తుంది-
పల్లె!
అక్కడ-గాలినీ, ధూళినీ, దోచేశారు
చెట్టుకొమ్మల్నీ, 'ఇంటి' కొమ్మల్నీ
దూసేశారు,
దగా, నిలువుదోపిడీ!
రెప్పల మీద 'అనావృష్టి' ఆరడిచేస్తోంది!
పైన
'ధరా'ఘాతాలతో
నజ్జునుజ్జయిపోయిన అవయవాలు
ఒళ్ళు విరుచుకునే శక్తి కూడా
లో గొంతుకలోనే గుటకేసింది!
అవినీతి పాము మేధనీ కాటేసింది
మకిలినడత నురుగులు కక్కుతోంది,
మూర్ఖ అహంకారాలు, అధికారాలు,
దేహం నీలంగా మారిపోతోంది-
వచ్చేప్రాణం, పోయేప్రాణం పరిస్థితి!
గ్రామాలు, పట్టణాలు, నగరాలు
నానారకాల డైనమైట్ల మీద
కునుకు తీసీతీయని సందర్భం!
మనిషి సంగతి? ప్రశ్నార్థకం,
చావంత బతుకుని మోస్తూ
తూలులూ, పేలుతూ
నిరీహలో కాళ్లీడ్చలేని జీవచ్ఛవం!
అరుస్తూ అరుస్తూ ఆగిపోతున్న కీచురాళ్ళు,
హేమంతంలో చెట్ల పగుళ్ల
మనిషిని మనిషి అనుమానించే
భయం దిగుళ్లు!
ఆశలు వెలిసిపోయిన సన్నివేశం!
సందర్భం
సన్నివేశం
అంతా ఒక
వచ్చీరాని ఉప్పెన సూచన!!
నిద్రపట్టదు-
భగవాన్ త్వరగా తెల్లవారనివ్వు
నా గొలుసూ, కొయ్యబండా-
నేనే బుజానికెత్తుకుని...
ఈసురో మంటూ, మొండిగా.....!
అవునూ-
మీరంతా స్వాగతిస్తున్నారా,
వీడ్కోలు పలుకుతున్నారా??!